నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
13 | హైదరాబాద్, సోమవారం 11 మార్చి 2024 | SIDDIPET


లేఖ రాస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు రాసిన లేఖ

## తక్షణమే నీళ్లిచ్చి పంటలను కాపాడాలి

### సిద్దిపేట జిల్లా రైతులకు అండగా నిలవండి

- రాజకీయాలు కాకుండా రైతు ప్రయోజనాలపై దృష్టి సారించాలి..
- కొత్త బోర్లు వేయడం, బావుల్లో పూడికతీతతో రైతులపై ఆర్థిక భారం పడుతున్నది..
- రంగనాయకసాగర్‌లోకి టీఎంసీ నీటిని వెంటనే ఎత్తిపోయాలి..
- రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ

సిద్దిపేట, మార్చి 10( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సాగునీరు విడుదల చేసి రైతులకు అండగా నిలవాలని ఆదివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు లేఖ రాశారు. సిద్దిపేట జిల్లా రైతుల ప్రయోజనాల దృష్ట్యా కొన్ని ముఖ్యమైన అంశాలను లేఖలో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. యాసంగిలో రైతులు వేసిన వరి పంటలకు నీరులేక ఎండిపోతున్నాయని, సాగునీరందించి వారికి అండగా నిలవాలని లేఖలో పేర్కొన్నారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో సాగు చేస్తున్న యాసంగి పంటలు గట్టెక్కాలంటే వెంటనే సాగు నీరందించాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన నాలుగేండ్లలో ముందస్తు ప్రణాళికతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిపడా సాగునీటిని అందించిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అలసత్వం వహిస్తున్నట్లు అర్థమవుతున్నదని లేఖలో పేర్కొన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, కండ్ల ముందు ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, కొత్త బోర్లు వేయిస్తూ అప్పుల పాలవుతున్నాని, బావుల్లో పూడికతీత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారని లేఖలో తెలిపారు. ఈ దుస్థితిని అధిగమించాలంటే వెంటనే రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోకి టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని కోరారు. నాలుగేళ్లు ఈ సమయంలో రంగనాయక సాగర్ నిండుకుండలా నీటితో కళకళలాడిందన్నారు. కానీ, ప్రస్తుతం నీళ్లు లేక రిజర్వాయర్ బోసిపోయి కనిపిస్తున్నదని హరీశ్‌రావు లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి కూడా తక్షణమే నీటిని విడుదల చేయాలన్నారు. అన్నపూర్ణ(అనంతగిరి) రిజర్వాయర్‌లో టీఎంసీ నీటిని నిల్వ ఉంచాలని లేఖలో కోరారు. క్షేత్ర స్థాయిలో మీరు పరిశీలించి వాస్తవాలను గ్రహించాల్సిందిగా కోరుతున్నానని పేర్కొన్నారు. రాజకీయాలు కాకుండా రైతుల ప్రయోజనాలపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు తగిన పరిష్కారం చూపించకుంటే త్వరలోనే రైతుల పక్షాన పోరాటాలకు సైతం సిద్ధమవుతామని, రైతులకు అండగా ఉంటానని లేఖలో మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.


సిద్దిపేట జిల్లా కొండాపూర్‌లో వరిచేనులో పశువులను మేపుతున్న రైతులు

సిద్దిపేట జిల్లా లక్ష్మీదేవిపల్లిలో బావిలో పూడిక తీయిస్తున్న రైతు మల్యాల లింగారెడ్డి

## అడుగంటిన ఆశలు!

### నీళ్లందక ఎండుతున్న పంటలు


సిద్దిపేట జిల్లాలో ఎండిపోయి నెర్రెలు వారిన పొలం

- పంటలను కాపాడుకునేందుకు బోర్లు వేయిస్తున్న రైతులు
- బావుల్లో జోరుగా పూడికతీత పనులు
- పదేండ్ల తర్వాత నీటికి గోస ఏర్పడిందంటున్న అన్నదాతలు

సిద్దిపేట, మార్చి 10: పదేండ్ల తర్వాత సిద్దిపేట జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండంతో పంట పొలాలు ఎండుతున్నాయి. సిద్దిపేట నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో రైతులు తమ పంట పొలాలను కాపాడుకోవడం కోసం బావుల్లో పూడికతీత పనులు, బోర్లు వేయిస్తున్నారు. దీంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. లోఓల్టేజ్ కరెంటు సమస్యతో మోటర్లు కాలిపోవడంతో రైతులపై మరింత భారం పడుతున్నది. సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో రైతులు పంట పొలాలను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. కేసీఆర్ పాలనలో కరువన్నది లేకుండా ఆనందంగా వ్యవసాయం చేసిన రైతుల్లో ప్రస్తుతం కండ్లనిండా కన్నీళ్లు కనబడుతున్నాయి. ఒక్కో రైతు తన పంట పొలాన్ని కాపాడుకోవడానికి నాలుగు నుంచి 8 బోర్లను వేశారు. మరికొందరు పాతబావుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు.

#### 15 రోజుల్లో ఆరు బోర్లు వేయించా..

పొట్ట కొచ్చిన వరి పొలాన్ని కాపాడుకోవడం కోసం 15 రోజుల్లో ఆరు బోర్లు వేయించా. ఒక్కో బోరు 400 ఫీట్ల వరకు వేసినా చుక్క నీరు రాలేదు. దీంతో రెండు ఎకరాల వరి పొలం విడిచిపెట్టా. 25 గజాల లోతు ఉన్న బావి పదేండ్ల తర్వాత ఈసారి ఎండిపోయింది. ఆయిల్ పామ్, మామిడి తోటకు నీరందించాలనే ఈరోజు మళ్లీ బోరు వేయించా. ఇప్పటి వరకు సుమారు 5 లక్షల ఖర్చు చేశాం. జీవాలకు, బర్రెలకు తాగేందుకు కూడా నీళ్ల ఇబ్బంది ఏర్పడింది.

–దండు రవి, రైతు, లక్ష్మీదేవిపల్లి, నారాయణరావుపేట మండలం

#### బావి పూర్తిగా ఎండిపోయింది..

బావి పూర్తిగా ఎండిపోవడంతో పంటను రక్షించుకునేందుకు మూడు బోర్లు వేయించా. అందులో ఒక్క బోరులోనే కొద్దిగా నీళ్లు వచ్చినయ్. వాటితోనే కొంచెం పొలం పారుతున్నది. జొన్న చేను పూర్తిగా ఎండిపోయింది. దాదాపు లక్ష యాభై వేల వరకు బోర్లకు ఖర్చు పెట్టాం. నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం.

–గుడిసె వంశీ, రైతు, మాచాపూర్, సిద్దిపేటరూరల్ మండలం

#### బాయిల నీళ్లు తగ్గడంతో పూడిక తీయిస్తున్న..

నాకు మూడు ఎకరాల పొలం ఉంది. రెండు ఎకరాల్లో పొలం ఏసిన. ఎకరం బీడుగా వదిలేశాను. బాయిలో నీళ్లు తగ్గడంతో పూడికతీస్తే నీళ్లు ఏమన్నా పెరుగుతాయేమో అని ఆశ ఉంది. వరితో పాటు కూరగాయలు సాగుచేశాం. నీళ్లు లేక కూరగాయల తోట ఎండిపోయింది. వరి పండుతుందన్న ఆశతోనే పూడిక తీయిస్తున్న. మస్తు తిప్పలు ఉంది. పూడిక తీయడంతో 50 వేల రూపాయల ఖర్చయ్యింది. పదేండ్లలో ఎన్నడూ నీళ్లకు కరువు రాలేదు. మళ్లా ఇప్పుడు గోస పడుతున్నం.

–మల్యాల లింగారెడ్డి, రైతు, లక్ష్మీదేవిపల్లి, నారాయణరావుపేట మండలం

## కరెంట్ ట్రిప్‌తో కాలుతున్న మోటర్లు

### నెర్రెలు వారుతున్న పంట పొలాలు

రామాయంపేట, మార్చి 10: విద్యుత్ సరిగ్గా ఇవ్వాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు అమలు కావడం లేదు. ఇష్టారాజ్యంగా కరెంట్ కోతల మూలంగా పంటలు ఎండిపోతున్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో కరెంట్ కోతలు తీవ్రంగా ఉన్నాయి. విద్యుత్ వస్తూపోతూ ఉండడంతో బోరు బావుల వద్ద ఉన్న కరెంట్ మోటర్లు కాలిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామాయంపేట మండలంలోని కోనాపూర్ గిరిజన పెద్ద తండాకు చెందిన రైతు మాలోత్ రమేశ్ ఆయనతో పాటు ఇతర రైతుల పంట పొలాలు ఎండిపోయి నెర్రెలు వారుతున్నాయి. కరెంట్ కోతల మూలంగా రెండు రోజులకోసారి బోరులో ఉన్న మోటర్‌ను తీయాలంటే వేల రూపాయల ఖర్చు అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖర్చుల మూలంగా అప్పుల పాలు కావడం తప్పా తమకేమీ మిగలకుండా ఉందని రైతులు వాపోతున్నారు. పంట వేసినప్పటి నుంచి నెల రోజుల్లో నాలుగుసార్లు మోటర్ కాలిపోయిందని రైతు రమేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. పంటను కాపాడుకుందామంటే రాత్రి పూట నాలుగు గంటలు, ఉదయం నుంచి సాయంకాలం వరకు కరెంట్ ఇస్తున్నా లోఓల్టేజీతో పాటు ప్రతి అరగంటకోసారి ట్రిప్ కావడంతో మోటర్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెదక్ జిల్లా కోనాపూర్ గిరిజన తండాలో కాలిపోయిన మోటర్‌ను పైకి తీస్తున్న రైతులు

## పట్నం వేసి.. మొక్కు తీర్చి

### భక్తజన సంద్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయం

- బ్రహ్మోత్సవాల 8వ ఆదివారానికి 25వేల మంది భక్తుల హాజరు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు

చేర్యాల, మార్చి 10: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్సవాల 8 వారాన్ని పురస్కరించుకుని ఆదివారం 25వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. శనివారం నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు ఆదివారం వేకువజామున నిద్రలేచి స్నానాలు ఆచరించి క్యూలో గంటల పాటు వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం పట్నాలు వేయించి మొక్కులు చెల్లించుకున్నారు. గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి, చేర్యాల ఎస్సైలు నాగరాజు, దామోదర్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ కమిటీ సభ్యులు ముస్త్యాల దామోదర్, భిక్షపతి ఉన్నారు.

పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న జఫర్‌ఘడ్ తహసీల్దార్ హరిప్రసాద్

## వైద్య శిబిరాలతో పేదలకు మేలు

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మార్చి 10: ఉచిత వైద్య శిబిరాల నిర్వహణతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మేలు జరుగుతుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని సర్ సీవీ రామన్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్(రేణుక) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ కరీంనగర్ సహా పలు పట్టణాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, కరీంనగర్‌లో రెండు శ్మశాన వాటికలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. లయన్స్ క్లబ్ హుస్నాబాద్ వారు కోరితే బాడీఫ్రీజర్లు, ఒక వైకుంఠ రథం మంజూరు చేయిస్తానని, ఇందుకోసం కలెక్టర్, ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేస్తానని చెప్పారు. తన తండ్రిపేరిట హుస్నాబాద్‌కు అంబులెన్స్‌ను అందజేస్తానని, లయన్స్ క్లబ్ వారు నిర్వహించాలని కోరారు. ఇప్పటికే హమాలీలు, గుమస్తా కార్మికుల హెల్త్ ప్రొఫైల్ తయారుచేయించామన్నారు. లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్‌చైర్‌పర్సన్ అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శివయ్య, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గోపాల్‌రెడ్డి, రాజగోపాల్‌రావు, నారాయణరెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## హాఫ్ మారథాన్ సక్సెస్

హాఫ్ మారథాన్, 10కేరన్, 5కేరన్ విజేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్

- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- విజేతలకు బహుమతులు అందజేత
- హాఫ్ మారథాన్ పూర్తి చేసిన అంధుడు లక్ష్మీనారాయణ, 75ఏండ్ల నాగభూషణం
- నిత్యం వ్యాయామం, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: మంత్రి పొన్నం

హుస్నాబాద్, మార్చి 10: హుస్నాబాద్‌లో రన్నర్స్ అసోసియేషన్, పోలీసుశాఖ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ (21కి.మీ.ల పరుగు పందెం, నాలుగో ఎడిషన్) ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. హాఫ్ మారథాన్‌తో పాటు 10కే రన్, 5కే రన్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. మొదట ప్రారంభమైన హాఫ్ మారథాన్ పట్టణంలోని ఏనె నుంచి అక్కన్నపేట గ్రామపంచాయతీ వరకు వెళ్లి తిరిగి రావడంతో పూర్తయింది. 10కే రన్ ఏనె నుంచి చౌటపల్లి క్రాస్‌రోడ్డు వరకు వెళ్లి తిరిగి రావడం, 5కే రన్ పట్టణంలోని నాగారం రోడ్డు, దవాఖాన రోడ్డు, డిపో రోడ్డు, మెయిన్‌రోడ్డు మీదుగా తిరిగి ఏనె వరకు చేరుకోవడంతో పందెం పూర్తయింది. హైదరాబాద్‌కు చెంది అంధుడు లక్ష్మీనారాయణతో పాటు 75 ఏండ్ల వృద్ధుడు నాగభూషణం హాఫ్ మారథాన్ పూర్తి చేయడం విశేషం. వీరిని మంత్రితో పాటు పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హుస్నాబాద్ పట్టణం నుంచే కాకుండా హైదరాబాద్, సిద్దిపేట, మెదక్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, జనగామ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రన్నర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. నిత్యం రన్నింగ్, వ్యాయామం, యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కేవలం మెట్రోపాలిటన్ సిటీల్లో నిర్వహించే హాఫ్ మారథాన్‌ను హుస్నాబాద్‌లో నాలుగుసార్లు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సతీశ్ వాసాల, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, సీఐలు శ్రీనివాస్, రఘుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల వెంకట్, పీఈటీలు వెంకటనర్సయ్య, చింత కింది శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రన్నర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

#### హాఫ్ మారథాన్ విజేతలు వీరే..

హుస్నాబాద్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్ పురుషుల విభాగంలో రమావత్ రమేశ్(నాగర్‌కర్నూల్) ప్రథమ స్థానంలో నిలవగా వాల్తా సంగూభాయ్ (వరంగల్) ద్వితీయ, తాతిరెడ్డి నిఖిల్‌రెడ్డి (గజ్వేల్) తృతీయ స్థానాన్ని సాధించారు. మహిళల విభాగంలో వడ్డె నవ్య(నల్గొండ) ప్రథమ, మద్దూరి కావ్య(వరంగల్) ద్వితీయ, సామ్యూల్‌గుల్(ఢిల్లీ) తృతీయ స్థానం పొందారు. 10కేరన్ పురుషుల విభాగంలో గోకర్ల అభిషేక్ ప్రథమ, పాయం శ్రావణ్ ద్వితీయ, డి.భరత్‌రాజ్ తృతీయ, మహిళల విభాగంలో కుషీకు మారి ప్రథమ, కల్యాణి ద్వితీయ, బడావత్ హారిక తృతీయ స్థానం పొందారు. 5కేరన్ పురుషుల విభాగంలో బోయ సింహ (కర్నూలు, ఏపీ) ప్రథమ, అనుతిరుపతి (జగిత్యాల) ద్వితీయ, ఆదికేశవ(హన్మకొండ) తృతీయ స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో ఎస్‌కే ఆఫ్రీన్ ప్రథమ, అంజుమ్ ద్వితీయ, బానావత్ ఇందు తృతీయ స్థానం సాధించారు. వీరందరికీ మంత్రి పొన్నం ప్రభాకర్ నగదు బహుమతులు అందజేశారు. పాల్గొన్న రన్నర్స్ అందరికీ మెడల్స్ పంపిణీ చేశారు.

దేవతామూర్తులకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

## కల్యాణం.. కమనీయం

ఝరాసంగం, మార్చి 10: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిపించారు. కల్యాణవేదికపై ఉత్సవమూర్తులను అర్చకులు ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కల్యాణంలో 79మంది దంపతులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ప్రజాప్రతినిధులు, భక్తులు హాజరయ్యారు. రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించారు. మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, ఆలయ మాజీ చైర్మన్ వెంకటేశం, ఎంపీటీసీలు రజినీప్రియ సంతోష్ పాటిల్, విజేందర్, ఈవో శశిధర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## క్రీడలతో ఆరోగ్యం

- రామాయంపేటలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడాపోటీలు ప్రారంభం
- బహుమతులు ప్రదానం చేసిన జిల్లా క్రీడల అధికారి నాగరాజు

రామాయంపేట, మార్చి 10: ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని మెదక్ జిల్లా క్రీడల శాఖ అధికారి నాగరాజు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్ అన్నారు. ఆదివారం రామాయంపేట పట్టణంలోని మెదక్ రోడ్డు బైపాస్ వద్ద సైక్లింగ్ క్రీడలను వారు ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయి సైక్లింగ్‌లో పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ద్వితీయ స్థానంలో రామాయంపేట విద్యార్థులు ముగ్గురికి వెండి పతకాలు లభించినట్లు నిర్వాహకుడు దండు యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో సైక్లింగ్ జాతీయ అవార్డు గ్రహీత దండు యాదగిరి, ప్రసాద్, సుభాష్‌చంద్రబోస్, సతీశ్‌రావు, దామోదర రావు, శ్రీకాంత్‌శర్మ, సంతోష్, తిరుపతిగౌడ్, రమేశ్, వేణు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి

## విద్యుదాఘాతానికి రైతు బలి

### ఎండుతున్న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి మృత్యువాత

బోయిన గణేశ్(ఫైల్)

మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

చేగుంట, మార్చి 10: విద్యుదాఘాతానికి రైతు బలైన ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం బీ-కొండాపూర్‌లో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. బాధిత కుటుంబం, పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామానికి చెందిన రైతు బోయిని గణేశ్(42)తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో వరి, మక్క పంట వేశాడు. పంట చేతికి వచ్చే సమయంలో నీరందక ఎండిపోతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున పొరకం పెట్టేందుకు చేను వద్దకు వెళ్లాడు. బోరు నడవక పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరును సరిచేసే సమీపంలో విద్యుత్ షాక్‌కు గణేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య కమల ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య కమల, కుమారులు కార్తీక్, అనిల్ ఉన్నట్లు చేగుంట ఎస్సై బాల్‌రాజు తెలిపారు.